క్లుప్తంగా

జేవీవీ ప్రత్యేక ఆహ్వానితుడిగా డాక్టర్ రవికుమార్



కపిలేశ్వరపురం: జన విజ్ఞానిక వేదిక రాష్ట్ర కార్యదర్శి వర్గ ప్రత్యేక ఆహ్వానితుడిగా మండపేటకు చెందిన గౌతమి హోమియో ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ చల్లా రవికుమార్ ఎన్నికయ్యారు. విజయనగరంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర మహాసభలో ప్రతినిధులు నూతన రాష్ట్ర కమిటీని ఎన్నికున్నారు. రవికుమార్ దీర్ఘకాలంగా సైన్స్ సంబంధిత ప్రచార, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సంగమం సాంస్కృతిక వేదిక ద్వారా సాహిత్య కృషి చేస్తున్నారు. ఆయన నియామకంపై అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్, జేవీవీ అనుబంధ రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ, కో కన్వీనర్ చిలుకూరి శ్రీనివాసరావు, జేవీవీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీవీవీ వరప్రసాద్, జి.ఈశ్వరరావు, జిల్లా విద్యా విభాగం కన్వీనర్ పడాల రామచంద్రారెడ్డి, మండపేట కమిటీ అధ్యక్షుడు గొడవర్తి సుధాకర్ అభినందనలు తెలిపారు.

ఎంపీటీసీల వేతనం చెల్లించాలి

కపిలేశ్వరపురం (మండపేట): ఎంపీటీసీ సభ్యులకు బకాయిపడిన 22 నెలల గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, మండపేట రూరల్ మండలం వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై గతంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శులు శశి భూషన్, ఎం.కృష్ణతేజలకు వినతిపత్రాలను అందజేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 13 వేల మంది ఎంపీటీసీ సభ్యులు, 650 ఎంపీపీలు ఎదుర్కొంటున్న సమస్యను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఊడిపడిన ప్రభుత్వ కార్యాలయ శ్లాబ్ పెచ్చులు



శ్లాబ్ నుంచి ఊడిపడిపోయిన పెచ్చులు

రాజోలు: మండల పరిషత్ కార్యాలయ శ్లాబ్ పెచ్చులు గురువారం ఒక్కసారిగా ఊడిపడిపోయాయి. అదే బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సమయంలో పడి ఉంటే చాలా మంది గాయపడేవారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు భవనంపై నీరు నిలిచిపోయి శ్లాబ్ లీకవుతోంది. దీంతో పెను ప్రమాదం తప్పిందని కార్యాలయ ఉద్యోగులు అన్నారు. సుమారు ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనంలో సమితి కార్యాలయం నిర్వహిస్తూ ఆపై మండల పరిషత్ కార్యాలయంగా మార్పు చేశారు. శిథిలస్థితికి చేరిన భవనంలో పై అంతస్తు భవనం నిర్మించడంతో పాత భవనంపై ఒత్తిడి పెరిగి శ్లాబ్ పెచ్చులు ఊడి పడిపోయి ఇనుప ఊచలు బయటకొచ్చేశాయి. సర్వసభ్య సమావేశంలో శిథిలస్థితికి చేరిన భవనం తొలగించి కొత్తది నిర్మించాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఏ క్షణంలోనైనా భవనం కూలిపోతుందని కార్యాలయ ఉద్యోగులు భయాందోళనతో విధి నిర్వహణ చేస్తున్నారు. తక్షణం అధికారులు స్పందించి శిథిలస్థితికి చేరిన భవనం తొలగించి కొత్తది నిర్మించాలని కోరుతున్నారు.

కంటి మీద కునుకు లేదాయె..

- ఖాళీ స్థలాల్లో నిలిచిపోతున్న వర్షపు నీరు
- డ్రైనేజీల్లో పేరుకుపోతున్న మురుగు
- వృద్ధి చెందుతున్న దోమలు
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

కె.గంగవరం: ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో పల్లెల్లో ఎక్కడికక్కడ ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలిచిపోతోంది. డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఈ మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రం అయితే చాలు ఇళ్లల్లో చేరుతున్నాయి. రాత్రుళ్లు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో మురుగునీటి కాలువల్లో పేరుకుపోతున్న చెత్తా చెదారం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అవి జనాలపై దండెత్తుతున్నాయి. దీంతో ప్రజలు జ్వరాలు, వ్యాధుల బారిన పడుతున్నారు.

పారిశుధ్యం అధ్వానం

గ్రామాల్లో పారిశుధ్య అధ్వానంగా ఉంది. డ్రైన్లు అస్తవ్యస్తంగా ఉండి మురుగునీరు రోడ్డుపైనే ఉంటోంది. దీంతో దోమల వృద్ధి చెందుతున్నాయి. దోమలు కుట్టడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రుల



పాణింగపల్లి-సత్యవాడ రహదారిలో స్వైర విహారం చేస్తున్న పందులు

దారిపడుతున్నారు. గత రెండు వారాలుగా మండల పరిధిలోని పామర్రు, పేకేరు, కుందూరు, దంగేరు గ్రామాల్లోని పీహెచ్‌సీలతో పాటు పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో జ్వర బాధితుల కేసులు ఎక్కువగా ఉన్నాయని వైద్య సిబ్బంది చెబుతున్నారు. రోగులు ప్రైవేటు ఆసుపత్రుల ద్వారా ప్రైవేటు ల్యాబ్‌ల్లో ఆయా పరీక్షలు చేయించుకుని వైద్య చికిత్సలు చేయించుకుని ఆర్థికంగా నిలిగిపోతున్నారు.

తప్పని పందుల బెడద

సీజనల్ వ్యాధుల్లో మెదడు వాపు వ్యాధి ఒకటి. అయితే ఇందుకు కారణమైన పందుల బెడద పెరుగుడుండడంతో అధికారులు ఎలాంటి ముందుస్తు చర్యలు తీసుకోలేకపోతున్నారు. కె.గంగవరం మండలంలోని పలు గ్రామాలతో పాటు



పామర్రు ఎస్సీ కాలనీలో చెత్తతో నిండిపోయిన మురుగు కాలువ

కాజులూరు మండలంలోని కొన్ని గ్రామాల్లో పందుల రోడ్డుపైనే సంచరిస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. సీజనల్ వ్యాధులు పెరగకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, గ్రామాలకు దూరంగా పందులను ఉంచాలని కోరుతున్నారు.

జ్వరాలు రాక ముందే జాగ్రత్తపడాలి

వర్షాలు కురుస్తుండడంతో వర్షపు నీరు నిలిచిపోతూ, మురుగు కాలువల ద్వారా దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమలను అరికట్టేందుకు అధికారులు ఫాగింగ్ చర్యలు చేపట్టడడం లేదు. మలేరియా, డెంగీ లాంటి జ్వరాలు విజృంభించక ముందే దోమలు, పందులను అరికట్టి, వ్యాధులను నియంత్రించి పల్లే వాసుల ఆరోగాన్ని కాపాడాలి

– పెట్టా శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కె.గంగవరం

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో పారిశుధ్య మెరుగుపడేలా చర్యలు తీసుకుంటు న్నాం. ప్రతి రోజు ఉదయం 6 గంటలకే పారిశుధ్య కార్మికులు డ్రైనేజీలు శుభ్రం చేయడంతో పాటు చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నాం. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నాం. ఫాగింగ్ ప్రక్రియ కూడా గ్రామాల్లో చేపడతాం. పల్లెల్లోని ప్రజలకు కూడా పారిశుధ్య మెరుగు పడడానికి సహకరించాలి.

– గౌరికుమారి, ఈఓపీఆర్‌డీ కె.గంగవరం

రేపు మండల సమావేశం

రామచంద్రపురం రూరల్: స్థానిక మండల సర్వ సభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాగారపు రాంబాబు గురువారం విలేకరులకు తెలిపారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం



అంగరలో రాట వేసి, పూజలు చేస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగర చేనేత సహకార సంఘం సమీపంలోని విజయ దుర్గాంబిక అమ్మవారి ఆలయం వద్ద దసరా ఉత్సవాలకు పందిరి రాట ముహూర్త పూజలు చేశారు. ఆలయ అర్చకుడు కొలువుల మల్లికార్జునరావు భక్తులతో పూజలు చేయించారు. ఉత్సవాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

పురుగు మందుల గుర్తులపై అవగాహన ఉండాలి



పురుగు మందుల విషప్రభావాన్ని గురించి రైతులకు వివరిస్తున్న ఏడీఏ నాగకుమార్



వెలంపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మణిదీప్

కె.గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి రైతు పురుగు మందులు విష ప్రభావ గుర్తులపై అవగాహన కలిగి ఉండాలని రామచంద్రపురం వ్యవసాయ సంచాలకులు నాగకుమార్ అన్నారు. కుందూరులో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పురుగు మందుల డబ్బాలపై ఎరుపు రంగు లేబుల్ ఉంటే అత్యంత విషపూరితమైందని, పసుపు రంగు లేబుల్ ఉంటే తీవ్రమైన విషపూరితమని, నీలం రంగు లేబుల్ ఉంటే మోస్తరు విషపూరితమని, ఆకు పచ్చ రంగు లేబుల్ ఉంటే తక్కువ విషపూరితమని గుర్తించాలని తెలిపారు. వీటిపై అవగాహన ఉంటే రైతులు పురుగుమందులను సురక్షితంగా, అవసరానికి అనుగుణంగా వాడే అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం కాండం తొలుచు పురుగు జీవిత చరిత్ర గురించి అవగాహన కల్పించి దాని నివారణకు తీసుకోవల్సిన చర్యలను గురించి రైతులకు వివరించారు. మండల ఏఓ సద్గురుమూర్తి సొసైటి సభ్యులు రాయుడు, వీఏఏలు రేవతి, కృష్ణ, తేజ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కషాయాలపై రైతులకు అవగాహన

రామచంద్రపురం రూరల్: వెలంపాలెం రైతు సేవా కేంద్రం వద్ద మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ ఆధ్వర్యంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రైతు వెన్నపు శ్రీనివాస్ పొలంలో ఉల్లి, వేప కషాయం, అగ్ని అస్త్రంలను డ్రోన్‌తో స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా ఏఓ మణిదీప్ మాట్లాడుతూ అగ్ని అస్త్రం వల్ల ఆకు ముడత పురుగు, కాండం తొలిచే పురుగు, కాయ తొలిచే పురుగు, వేరు పురుగుల చీడపీడల నివారణ అవుతుందన్నారు. ఉల్లి, వేప కషాయం వల్ల తామర పురుగు, పేను బంక, తెల్లదోమ, అగ్గి తెగులు నివారించవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఉపయోగించే కషాయాల వలన ఖర్చు తగ్గించుకుని ఆదాయం పెంచుకోవడానికి అవకాశం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు ప్రవీణ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శివరామకృష్ణ, సతీష్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం



గొల్లపాలెంలో చెరకురసం షాపును ప్రారంభిస్తున్న ఎస్సై మోహన్‌కుమార్

కాజులూరు: ఆపదలలో ఉన్న పేదలను ఆదుకోవడంలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఒక పేద కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ లక్ష రూపాయల విరాళంతో ఏర్పాటు చేసిన చెరకు రసం షాపును అందించి, దానిని గురువారం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరప మండలం సిరిగలపల్లి లంకకు చెందిన గుత్తుల శివకృష్ణకు బ్రెయిన్ ఆపరేషన్ జరిగి ఇంటికే పరిమితమయ్యాడన్నారు. దీంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమతుండగా విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఏ శ్రావని హైద్రాబాద్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, సంస్థ చైర్మన్ జి విఠల్ రెడ్డిని సంప్రదించగా వారు రూ.70 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. సంస్థ సభ్యులు మరికొంత మొత్తాన్ని సమకూర్చి ఆ కటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేయడంతోపాటు చెరకు మెషీన్, షాపు ఏర్పాటుకు సహకరించారన్నారు. సంస్థ సభ్యులకు ఎస్సై, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కె.సూర్యకుమారి, జడా రామతులసి, హరిబాబు, సూర్యకిరణ్, హర్షిత్, ఉదయ, చిన్నా, కడలి రాంపండు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుళ్లు, చైర్ల వితరణ



బ్యాంకు మేనేజరు చంద్రశేఖరరావును సత్కరిస్తున్న డీవైఈవో, హెచ్‌ఎం తదితరులు

రాయవరం: చెల్లూరు శివారు కృష్ణమ్మచెరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గురవారం బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ద్వారా టేబుళ్లు, చైర్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాఠశాలకు ప్రభుత్వం సమకూరుస్తున్న మౌలిక సదుపాయాలతో పాటుగా, దాతలు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజరు చంద్రశేఖరరావు మాట్లాడుతూ సోషల్ రెస్పాన్స్‌బిలిటీలో భాగంగా పాఠశాలకు రూ.12వేలు విలువైన టేబుల్స్, చైర్లను అందజేస్తున్నట్టు తెలిపారు. బ్యాంకు మేనేజరు చంద్రశేఖరరావును హెచ్‌ఎం జి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రెవెన్యూ సిబ్బంది



కపిలేశ్వరపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

కాజులూరు: రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మండల వీఆర్వోల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ రెవెన్యూ ఉద్యోగులు మండల తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళనలు చేపట్టారు. అనంతరం తహసీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్‌కు వినతిపత్రం సమర్పించారు. మండల గ్రామాలకు చెందిన వీఆర్‌ఏలు, వీఆర్‌ఓలు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వం వచ్చిన 15 నెలలు పూర్తయిన తమ డిమాండ్లను పరిష్కరించడంలో విఫలమైందని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం కపిలేశ్వరపురం మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలివెల నాగేశ్వరరావు, కె.శ్రీనివాస్ అన్నారు. వీఆర్‌ఏల డిమాండ్ల సాధనకై గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ పే స్కేల్‌ను వెంటనే అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులైన వీఆర్‌ఏలను అటెండర్, వీఆర్‌ఓ, నైట్ వాచ్‌మెన్, డ్రైవర్ తదితర పోస్టులతో భర్తీ చేయాలని, కారుణ్య నియామకాలను చేపట్టాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. నేడు కూడా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనను కొనసాగిస్తామన్నారు. 20న రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయం, 22న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎ.శివప్రసాద్, సహాయ కార్యదర్శి ఎంజే బాబు, 19 గ్రామాల్లోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



మండపేటలో క్రీడాకారులను సత్కరిస్తున్న చైర్ పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): ఇటీవల మండపేట డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అభినందించారు. మండపేటకు చెందిన క్రీడాకారులు పీజేఎండీ రామారావు, వద్దాది వినయ్‌కుమార్‌లను మున్సిపల్ కార్యాలయంలో తన చాంబర్‌లో చైర్‌పర్సన్ దుర్గారాణి శాలువాలతో సత్కరించారు. త్వరలో ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ పోటీల్లోనూ, జర్మనీలో నిర్వహించనున్న ప్రపంచ కప్ పోటీల్లోనూ ఇదే తరహాలో ప్రతిభ కనబర్చాలని చైర్‌పర్సన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



అంగరలో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్ఓ దొర



కందులపాలెం వైద్య శిబిరంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది, నాయకులు

కపిలేశ్వరపురం: మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధను కనబర్చుతూ కేంద్ర ప్రభుత్వం 'స్వస్థ నారీ-సశక్త్ పరివార్ అభియాన్' పేరుతో ప్రత్యేక ఆరోగ్య ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర అన్నారు. అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీఎన్ఎస్‌డీ రత్నకుమారి ఆధ్వర్యంలో తాతపూడి గ్రామ సచివాలయం వద్ద ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ గూటం శ్రావణి శిబిరాన్ని ప్రారంభించగా అతిథిలుగా ఎంపీటీసీ జిత్తుక వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గుత్తుల సురేష్ డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తిక్ హాజరయ్యారు. ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు మాట్లాడుతూ 19న కపిలేశ్వరపురం-2, 22న అంగర, 29న పడమర ఖండ్రిక, 30న కపిలేశ్వరపురం-1 సచివాలయం పరిధిలో శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బ్రహ్మాజీ, ఎంపీహెచ్ఎస్ నానిబాబు, హెచ్‌వీ టి.మేరీమణి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి పాల్గొన్నారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు డాక్టర్ ఎస్.కుమారి, డాక్టర్ విజయదీపిక, కార్యకదర్శి వై.శారద ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతామంటూ వైద్య,



వైద్య శిబిరంలో మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనిరుథ్

ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు ప్రమాణం చేశారు.

ఆరోగ్య సంరక్షణకు నాంది

రాయవరం: ఇంటికి దీపం ఇల్లాలు అని, ఆమె ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం శక్తివంతంగా ఉంటుందని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వి.అనిరుథ్, రమ్య పేర్కొన్నారు. మండలంలోని సోమేశ్వరం సచివాలయం-2లో గురువారం స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రగతికి మహిళలే మూలమన్నారు. ప్రతి మహిళా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో 140 మందికి చక్కెర, బీపీ, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు రక్తహీనత తదితర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరిఫ్, మాజీ సర్పంచ్ వైఆర్‌కే పరమహంస, సొసైటీ చైర్మన్ శాకా కోటేశ్వరరావు, స్థానిక నేతలు శాకా నాగేంద్ర, మణిప్రసాద్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కందులపాలెంలో వైద్య శిబిరం

రామచంద్రపురం రూరల్: కందులపాలెంలో గురువారం వైద్య శాఖ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సందీప్ నాయుడు, వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వి.స్వాతి భవాని, డాక్టర్ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ మహిళలు, కిశోర బాలికలను స్క్రీనింగ్ చేయడం ద్వారా వారిలో రక్త హీనత, తదితర వ్యాధులను గుర్తించి అవసరమైన చికిత్సలు అందిస్తారన్నామన్నారు. వైద్య శిబిరంలో 11 మంది గర్భిణులను, 10 మంది కౌమార బాలికలను పరీక్షించించారు. 60 మందికి రక్తపోటు పరీక్షలు, 65 మందికి మధుమేహ పరీక్షలు, 75 మందికి కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఎంపీటీసీ గుత్తుల అచ్యుతవేణి, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, నాయకులు వైట్ల రాజబాబు, గజలక్ష్మి, డివిజనల్ మెడికల్ సూపర్‌వైజర్ జి. కమల్ శేషు, సూపర్‌వైజర్లు డి. వైకుంఠరావు, జి. రత్నం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళ్యాణ్, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన జడ్జి



సబ్ జైలులో రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి శ్రీలక్ష్మి

కొత్తపేట: స్థానిక సబ్ జైలును రాజమహేంద్రవరం జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) సెక్రటరీ శ్రీలక్ష్మి గురువారం సందర్శించారు. సబ్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితుల వివరాలు, వారి బాగోగుల గురించి జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల సెల్స్‌ను, జైలు ప్రాంగణాన్ని, వంట గదిని, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. నిందితులకు లీగల్ ఎయిడ్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ జీవనాధం, న్యాయవాదులు భాస్కరరావు, పీఎల్‌వీ కృష్ణ, కోర్టు సిబ్బంది, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి పవిత్రోత్సవాలు ప్రారంభం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన శ్రీపద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త గణేశుల వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో శ్రీవారి పవిత్రోత్సవాలను ప్రారంభించారు. రెండు రోజులు స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారి కె.రత్నాలరావు గురువారం తెలిపారు. విద్యుత్ లైన్లు వెంబడి చెట్టు కొమ్మలను తొలగించడమూ, విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు నిమిత్తం నల్లూరు, కాలేరు, సుభద్రాపురం, అచ్యుతాపురం, వడ్లమూరు, నిడసనమెట్ట గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కాజులూరు మండలంలో..

కాజులూరు: గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపి ఈపీడీసీఎల్ డీఈ ఎన్.ఉదయ్ భాస్కర్ తెలిపారు. సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు.